బాపు నరహరి*

# విధి తెచ్చిన మార్పు



సముద్రంలో పుట్టిన అల నీటిపై జారుతూ ఒడ్డువరకు వచ్చి అక్కడ కూర్చొని ముచ్చట్లాడుకొంటున్న ఇద్దరు వ్యక్తులను చూసి వెనక్కు జారిపోయింది, సముద్రంలోకి.

"నాజీవితంలో అటువంటి రోజును చూస్తాననుకోలేదు.' అన్నాడతను ఆకాశంలో అలుముకొన్న నల్లని మేఘాలవైపు చూస్తూ.

నేనాశ్చర్యంగా అతన్ని చూస్తు నిశబ్దంగా కూర్చున్నాను.

"ఆ రోజును జీవితంలో మర్చిపోలేను. నాజీవిత సర్వస్వం ఆ రోజుతో అంతమైంది. దానికి కారణం ఈ అర్థం లేని ప్రకృతి. ఆరోజునుండి ప్రయత్నించాను ఆత్మహత్య చేసుకుందామని. కాని ఆశ నన్ను చావనీయటం లేదు."అతను ఆగి నిట్టూర్చాడు.

అతని కళ్ళల్లోకి చూస్తుండి పోయాను.

సముద్రపు గాలి పీల్చి, అక్కడి వాతావరణం అనుభవించటానికి వచ్చిన అనేకమందికి వ్యాయం చేకూరుస్తుంది సముద్రం. అనేకహృదయాలకు చల్లదనాన్నందిస్తుంది. తల్లి చేతిని పట్టుకొని తప్పటడుగులతో నడుస్తున్న పాప, సముద్రపు నురుగును జుర్రుకోవాలన్నట్టు తన బుల్లి బుల్లి చేతులతో వెనక్కు పరిగెత్తుతున్న నీటిని రమ్మని గొడవ చేస్తోంది. పాప తల్లి చిరునవ్వుతో ఏదో చెబుతోంది. సముద్రపు హోరులో ఆ తల్లి చెప్పే మాటలు కలిసి పోతున్నాయి.

అతను తిరిగి చెప్పటం ప్రారంభించాడు.

"జీవితానికి సర్వస్వం తనే అనుకొనే వ్యక్తి పోయాక బ్రతికి లాభం ఏమిటి? నాకు జీవితం అంటే అర్థం తెలిసిన వ్యక్తి దూరమైనా నేనిలా బ్రతికి ఉన్నానంటే మీరే చెప్పండి నేనెంతగా ఆవ్యక్తి కోసం ఆశపెట్టుకున్నానో!?'

నేనతని ధోరణికి తికమక పడసాగాను.

"మీరు ఆత్మహత్య చేసుకోక పోవటానికి కారణం ఆవ్యక్తి ఇంకా ఉందన్న ఆశ వల్లనా?' కొద్దిగా జంకుతూ అడిగాను.

"అవును". అతను వత్తిపలికిన తీరు, ఆ కంఠస్వరపు కాఠిన్యం నన్నాశ్చర్య పరిచాయి.

"లోకంలోని ప్రతి వ్యక్తికీ ఆశ అనేది సహజం" అన్నాను నాలోనేను గొణుక్కొంటున్నట్టు.

"ఈలోకమంటే నాకసహ్యం." అతను నుదురుకు పట్టిన చెమటను తుడుచుకొంటూ అన్నాడు.

"లోకం మీకేం అపకారం చేసింది?"అతని సంస్కార హీనమైన మొహం లోకి చూసి ప్రశ్నించాను.

"ఈ లోకం చేయబట్టే నేనావ్యక్తిని ప్రేమించింది, చివ్వరికి పోగొట్టు కొన్నదీనూ" సగం కాలిన సిగరెట్టు చివర్ని బొటని వ్రేలితో తడ్తూ అన్నాడు.

"నేను చెప్పే విషయం వింటే మీరు లోకాన్నంతగా చులకన చేయరు." అన్నాను ఇసకను చేతితో కుప్ప చేస్తూ.

"చెప్పండి" అన్నాడతను ఏదో ఆలోచిస్తూ.

"ఓ సిగిరెట్టు "అన్నాను నాదగ్గర అయిపోయినట్టు.

అతనో సిగిరెట్టును సగం తుంచి ఇచ్చాడు.

"మా స్వగ్రామం ఖమ్మం దగ్గరి చింతకాని" అన్నాను ప్రారంభిస్తూ.

అతను పొగను బలంగా పీల్చి కాల్చుకొమ్మన్నట్టు తన సగం కాలిన సిగరెట్టును నాకిచ్చాడు.

అతని ముక్కను తిరిగి ఇచ్చేస్తూ అన్నాను "మీ దాన గుణం నాకు నచ్చిందండి."

అతను పెద్దగా నవ్వాడు.

"ఊఁ! చెప్పండి" అన్నాడతను నవ్వాపుతూ.

కుప్పగా చేర్చిన ఇసుకను చెదరగొడ్తూ

చెప్పసాగాను.

"మాయింట్లో నేనే పెద్దవాడిని, అందుకే మాఅమ్మా నాన్నగారు నన్నెంతో గారాబంతో పెంచేవారు. కాని 'విధి' నా నాల్గవ ఏట మా నాన్న గార్ని మాకు దూరం చేసింది. కేవలం మా నాన్నగారి జీతపు రాళ్ళ మీద ఆధారపడిన మాకు లోకం చీకటి కూపంగా మారింది. నిరాధారమైన మా కుటుంబానికి సహాయంగా ఊళ్ళోని పెద్దలంతా చందాలు ప్రోగు చేసి మాకు కుట్టుమిషను కొనిచ్చారు. నా కోసం మా అమ్మ అలవాటులేని ఆ పని నేర్చుకొని మా జీవన నౌకకు చుక్కానైంది.

నాకు ఆరవ సంవత్సరం రాగానే మా ఇంటి ప్రక్కనే ఉన్న పంతులుగారు నన్ను బడిలో చేర్పించారు. ఆయనగారి ధర్మమా అని స్కాలర్‌షిప్ సంపాదించి చదవసాగాను." చెప్పటం ఆపి పూర్తిగా కాలిపోయిన సిగిరెట్టు ముక్కను విసిరేసాను.

సముద్రం మా దగ్గరకురావాలని విశ్వప్రయత్నం చేస్తోంది. చిన్నపాప, తల్లి, రెండుచేతులను పట్టుకొని తప్పటడుగులతో నడుస్తూ కనుమరుగైపోయింది.

అతను నా కథను ఆసక్తిగా వింటు రెండవ సిగిరెట్టు ముక్క అంటించి ఇచ్చాడు. నేను దాన్ని అందుకొంటు చెప్పసాగాను. "ఆ రోజుల్లోనే వసుంధరతో నాకు పరిచయం ఏర్పడింది."

"వసుంధరంటే?" అన్నాడతను ఆశ్చర్యంగా మొహం పెడుతూ.

"నాతో కలిసి చదివిన స్నేహితురాలు. మా ఇంటికి దగ్గర్లో ఉండేవారు. వసుంధర రోజు దైవపూజకని గులాబీలు తెచ్చి ఇచ్చేది. ఒకరోజు ఇంట్లో అమ్మ లేని సమయాన గులాబీలు తెచ్చింది. పూలను అందుకొంటూ అడిగాను, "వసూ! ఎందుకివి?" అంటూ

"దేవుడికి" అంది తలవంచుకొని.

"దీని స్థానం ఎక్కడో తెలుసా?" అన్నాను చిరునవ్వు నవ్వుతూ.

"ఉహు!" అంది తల ఎత్తకుండానే.

"నీ నల్లని కురులలో ఎర్రని గులాబి" అన్నాను. ఆమె తలవంచుకొని సిగ్గుతో పారిపోయింది. మా ఇద్దరి మధ్య ప్రేమ బీజంగా ఉపకరించిన ఆ గులాబీలను ప్రేమతో ముద్దు పెట్టుకొన్నాను."

"మీ ఇద్దరికి అంతకుముందు పరిచయం ఉందా?" అడిగాడతను సూటిగా పొంగుతు'న్న వీటిని చూస్తు.

"అంతకుముందే ఆమెతో చనువు ఉండేది."

"తరువాత......" అన్నాడతను దృష్టి మరల్చకుండానే.

కాలచక్రభ్రమణంలో చిక్కుకొని పెరిగిన మా ప్రేమ అంతస్తుల ధాటికి ఆగలేకపోయింది. మా విషయం తెలిసిన వసుంధర తల్లితండ్రులు నన్ను వేడుకొన్నారు, బయపెట్టారు, వసుంధరని మరిచిపొమ్మని. కాని నా సమాధానం వారికి నిశ్శబ్ద రూపంలోనే ఉండేది. వారు వసుంధరకు సంబంధాలు చూసేవారు. కాని మా ప్రేమ విషయం ఎలా తెలిసేదో కాని, ఆసంబంధాలు వెనక్కు తిరిగిపోయేవి."

అతను నిట్టూర్చాడు.

"అవి నేను మెట్రిక్ పాసైన రోజులు. ఓ రోజు మా పంతులుగారు పిలిచి ఏదైనా ఉద్యోగం వెతుక్కొని తల్లి ఋణం తీర్చుకొమ్మని చెప్పారు. ఆ రోజు రాత్రే వసుంధరతో చెప్పకుండ అమ్మం రైలెక్కాను. ఉద్యోగం కోసం చెప్పులరిగేలా తిరిగాను. వారం గడిచాక గుమాస్తాగా అరవైరూపాయిల ఉద్యోగం దొరికింది. అమ్మకు, వసుంధరకీ శుభవార్త చెప్పి తీసుకెళ్దామని చింతకాని జేరాను. కాని వూహించనంతిగా మారిపోయింది నా జీవితం."

సముద్రంలో హెూరు వినసొంపుగా లేదిప్పుడు. అతను శిలా ప్రతిమలా కూర్చుండిపోయాడు.

"రైలు దిగిన నాకు ఎదురైన పంతులుగారు నిశ్శబ్దంగా కన్నీళ్ళు తుడుచుకొంటూ "దురదృష్టవంతుడివోయ్" అంటు వెళ్ళిపోయారు.

ఆయోమయంలో పడిన నేను ఇంటివైపు గబగబా నడిచాను. జనసమర్ధాన్ని చూసి నేను తోసుకుంటూ లోనికెళ్ళాను. ఇల్లు కాలిపోయింది. నన్ను చూసిన ఇల్లు కోపంగా పొగలు కక్కుతోంది. ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాయి. తల తిరుగుతున్నట్లనిపించింది.

"పాపం ఒక్కగానొక్కడని ఎంతో కష్టంతో పెంచిందా మహాతల్లి, దురదృష్టవంతుడు."

నాకు 'అమ్మ' జ్ఞాపకం వచ్చింది. "అమ్మా" అన్నాను పొగలోకి చూస్తు. "ఇంకెక్కడమ్మ నాయినా..." లీలగా వినిపించాయా మాటలు. అంతే. ఆపై జరిగిన సంగతి నాకు తెలియదు.

కళ్ళు తెరిచేసరికి చుట్టూ వూరిపెద్దలు కనుపించారు. డాక్టర్ నాకు ఇంజెక్షన్ ఇస్తున్నాడు. జరిగినది మెల్లిగా జ్ఞాపకం చేసుకోసాగాను. నాకు అమ్మ జ్ఞాపకం వచ్చింది. 'అమ్మా!' నాకు అమ్మ లేదు. తల తిరుగుతున్నట్లనిపించింది. ఒంటిపై మైకం కమ్మింది. నాల్గవరోజు కొద్దిగా తేరుకొన్న నన్ను 'డిస్చార్జి' చేశారు. ఆసుపత్రి వెలుపలికి రాగానే అమ్మ జ్ఞాపకం వచ్చింది. మెల్లిగా ఇల్లు చేరాను. కప్పులేక, నల్లగా మాడిపోయిన గోడలు దర్శన మిచ్చాయి. ఇంట్లో ఏమీలేదు. కళ్ళారా చూసుకోవటానికి అమ్మ శవంకూడా లేదు. నా కన్నీళ్ళు చూసి జాలిపడే మానవులు కరువైయారు, రోజంతా తిండి లేకుండా గడిపాను. ఆకలంటున్న నా ప్రేగుల్ని ఓదార్చటం నాతరం కాలేదు. అమ్మ ఉండి ఉంటే??

నేను మనసు శాంతించేదాక లోకాన్ని దూషించాను. ఏకాకినైన నాకీ లోకంలో తోడెవరు? ఏనాడూ నన్ను వదిలి ఉండని అమ్మ నాకు చెప్పకుండ ఈలోకం వదిలి వెళ్ళిపోయింది. హృదయం, కడుపు, మెదడు అన్నీ ఒక్కసారిగా భగ్గుమన్నాయి" చెప్పటం ఆపి రెండవ సిగిరెట్టు ముక్కను అవతల పారేశాను.

అతని కళ్ళ నుండి నీరు కారటం గమనించాను

జనసమర్ధం పలుచబడసాగింది. సముద్రం గొణగటం మానలేదు. చీకటి పూర్తిగా అలుముకొంది.

చీకటిలో దూరంగా కొన్ని విద్యుత్ దీపాలు మాత్రం మమ్మల్ని విచిత్రంగా చూస్తున్నాయి.

నా కథకు సానుభూతిగా అప్పుడప్పుడు వాన తుంపర్లు పడసాగాయి.

అతను ఆలోచిస్తు వింటున్నాడు.

"చలి కూడ నా బాధలకు తోడైంది. రాత్రల్లా పిచ్చిగా ఆ కాలిన ఇంట్లో తిరిగాను. తెల్లతెల్లవారుతూండగా అలసిన శరీరం మత్తుగా వాలిపోయింది.

కళ్ళు తెరిచేసరికి పూర్తిగా తెల్లవారింది. జనం నన్ను వింతగా చూస్తున్నారు. అందరి వైపు విరక్తిగా చూస్తూ లేచాను. ఇల్లంతా గాలించాను. శూన్యమైన నా జీవితానికి మిగిలింది శూన్యమే. నా సర్టిఫికెట్లు బూడిదగా మారి నా కాలిక్రింద గాలిలో కలిసిపోయింది.

ఏ బాధ కోర్చినా మానవుడు ఆకలి బాధకోర్వలేడు. తిండి దొరకని ఆ పరిస్థితిలో నన్ను చూసి నాకే జాలేసింది. బిచ్చమెత్తాలంటె అభిమానం అడ్డొచ్చింది. అయినా అభిమానాన్ని చంపుకొన్నాను.

వసుంధర! మొదట జ్ఞాపకం వచ్చింది. మెల్లిగా వసుంధర ఇంటివైపు నడిచాను.

వసుంధర ఇంట్లో పెళ్ళి ఆనందం క్రమ్ముకొనుంది. పచ్చని తోరణాలు, ఇల్లంతా పెళ్ళి సందడితో నిండి ఉంది. అది ఎవరి పెళ్ళి ఉత్సవమో వూహించాను. మెల్లిగా నడుస్తూ ఇంటి ఆవరణలోకి ప్రవేశించాను. దూరంగా ఒక గదిలో వసుంధరను పెళ్ళి కూతురిగా అలంకరిస్తున్నారు. దూరం నుండి దివి నుండి దిగివచ్చిన దేవకన్యలా కనుపించింది. వసుంధర నన్ను చూసింది. తరువాత జరిగిందేమిటో తెలుసా?"

అతను వింటున్నాడు నిశ్శబ్దంగా.

చీకటిలో సముద్రపుగాలి ఎలా ఉంటుందో అన్న ఆసక్తితో ఇద్దరు దంపతులు చేతిలో చేయి కట్టుకొని మా ముందుగా నడిచి వెళ్ళిపోయారు.

"వసుంధర వచ్చింది" అన్నాను ఎండిన నోటిని చప్పరిస్తూ.

"తరువాత?" అన్నాడతను నీరసంగా.

"నన్ను చూసి వసుంధర ఉలిక్కిపడింది. నా ఆకారం అప్పట్లో బికారి కంటె కడుహీనంగా ఉంది. నన్ను లోనికి రమ్మని ఆహ్వానించింది.

రానన్నాను.

తోటలోకి రమ్మంది.

ఇద్దరం తోటలో మల్లె తీగ చాటుకెళ్ళి నుల్చున్నాము.

వసుంధర పెళ్ళికూతురు దుస్తుల్లో నా కాళ్ళకు చుట్టుకొని ఏడుస్తూ అంది. 'నన్నెక్కడికన్నా తీసుకెళ్ళండి, నన్ను వదిలిపోకండి.'

నవ్వాలో ఏడ్వాలో తోచలేదు. అందంగా మెరుస్తున్న వసుంధర భుజాలు పట్టుకొని లేపాను. నా గుండెల్లో తల దాచుకుని చొక్కాంతా కన్నీటితో తడిపేసింది.

'వసూ! నా పరిస్థితి చూసే అంటున్నావా?' అన్నాను విరక్తిగా నవ్వుతూ.

"అన్నీ నిర్ణయించుకున్నాను. పదండి వెళ్లిపోదాం." అంది నా చెయిపట్టిలాగుతూ. వసుంధర కళ్ళ నుండి జారిన నీటిని తుడుస్తూ అన్నాను. 'చూడు వసూ నిన్ను పోషించలేని అసమర్థుడ్ని నా దగ్గర ఏం తిని బతుకుదామని?' ఓదార్చాలని చూశాను.

'మీరేది తింటె అదే చాలు మీ సాన్నిధ్యంలో ఉండటం మించి నేనేమీ కోరలేదు.'

"వసూ! నీకు సర్వసుఖాలనొసగే భర్త లభించబోతున్నాడు..."

నా నోటికి వేళ్ళు అడ్డం పెడుతూ అంది. 'మీరటువంటి మాటలనకండి.'

'వసూ' గంభీరంగా ఒక పిలుపు మా వెనుకగా వినవచ్చింది. వసుంధర అన్నయ్య మెల్లిగా నడుస్తూ మా దగ్గరికి వచ్చాడు. వసుంధర చేయిపట్టి దూరంగా

# విధి తెచ్చిన మార్పు

గుండె పిడికిలి బిగించి నా పెదవులపై బలంగా కొట్టాడు. పెదవులు చిట్లి రక్తం చిమ్మింది.

'గెట్ అవుట్ యూ ఫూల్' అంటూ అరిచాడు. వసుంధర మధ్యలో కొచ్చింది. అతను వసుంధరను ప్రక్కకునెట్టి నన్ను రక్తం కక్కుకునే దాక కొట్టి పొలీసులతో తరిమేయమని చెప్పాడు. వసుంధర అప్పటికే మూర్ఛపోయింది. ఆమెను లోనికి తీసు కెళ్ళారు.

నేను ఆకలి బాధ దెబ్బల బాధతో వూరు విడిచి పొలిమేర్లలో ఉన్న తోటలో ఒక చెట్టుకింద నిద్దుర పోయాను. తోటమాలి నన్ను చూసి జాలిపడి రక్తం తుడిచి కడుపు నిండా అన్నం పెట్టాడు. నా కథ విని కన్నీళ్ళు కార్చాడు.

మరుసటిరోజు ఉదయం భోజనం చేసి పూరి వైపు బైలుదేరాను. వూరంతా తిరిగి రాత్రి పూరి గుడి మంటపంలో నిదుర పోయాను.

మధ్యరాత్రి మెలుకువ వచ్చేసరికి పెళ్ళి వాయిద్యాలు గుడిలో నుండి వినిపించాయి. లేచి కళ్ళు నలుపుకొంటూ గుడిలో కెళ్ళి ఓ చీకటి మూలలో నిలబడ్డాను. ఎవరో దంపతులు దేవుని ఆశీర్వాదం కోసం వచ్చారు. 'మేనా'లో నుండి వసుంధర భర్తతో దిగుతూ కనుపించింది. కళ్ళు పెద్దవిచేసి చూశాను. చాలా బాగా కుదిరింది ఈడుజోడు. తృప్తిగా ఆనంద బాష్పాలు తుడుచుకొన్నాను. మనసులోనే ఆ దంపతులను ఆశీర్వదించి అక్కడుండలేక పూరి వైపు వడివడిగా నడుస్తూ వెళ్ళిపోయాను. వారంరోజులు పిచ్చికుక్కలా తిరిగాను. అలవాటులేని తిరుగుడు, నిరాహార స్థితి నన్ను క్షయవ్యాధి సంక్రమించిన వాడికిమల్లె చేశాయి.

నా స్వంతవూళ్ళో ఉండటం కష్టమనిపించింది, మెల్లిగా రైలుస్టేషన్ వైపు నడిచాను. సాయంత్రం నీళ్ళతో కడుపు నింపుకొని నిద్దురపోయాను. మగత నిద్దుర పట్టింది, ఎన్నో రైళ్ళు ఆగకుండాపోయాయి. తెల్లతెల్లవారుతూండగా మద్రాసు వెళ్ళే రైలు పెద్ద శబ్దంతో వచ్చి ఆగింది. స్టేషన్‌లో జనం ఎక్కువగా లేరు. అక్కడక్కడ మాత్రం ప్రయాణీకులు ముచ్చట్లాడు కొంటున్నారు. అటు ఇటు చూసి ఒక డబ్బాలో ఎక్కబోయాను. ప్రక్కనే డబ్బాలో వసుంధర భర్తతో ఎక్కడం చూశాను. క్షణం ఆగి నేనూ ప్రక్కనే డబ్బాలో ఎక్కేశాను.

రైలు పెద్ద శబ్దంతో ముందుకు సాగిపోయింది!

* * *

మానవుడు అన్ని ప్రాణుల్లోకి అదృష్టవంతుడు. నవ్వటం, ఏడవటం, మెదడు నుపయోగించటం, అన్నీ ప్రసాదించాడు దేవుడు. మానవుడికి ప్రాణం పోసి అతని కోసం ప్రకృతిని సృజించి వారితో ఆట లాడే దేవుడు అపూర్వ శక్తిసంపన్నుడు. నన్ను భగవంతుడు న్యాయాధికారిగా చేశాడు. కావలసినంత ధనం ఇచ్చాడు, లోకంలో నటించమన్నాడు. నా కర్తవ్యంగా నేను ఎందరికో ఉరిశిక్ష విధించాను. అందులో న్యాయం, అన్యాయం చేసినవారందరూ ఉండేవారు. నా ఉద్యోగ ధర్మానికి చెవులున్నాయి కాని కళ్ళులేవు.

నాకా న్యాయవాది వృత్తి మీద గౌరవం తగ్గ నారంభించింది. ఎంతవరకు న్యాయం చేకూరుస్తున్నానో తలచుకొంటె చాలా బాధనిపించేది.

ఒకసారి కోర్టులో అన్యాయం అని తెలిసినా కోర్టు కట్టుబాట్లని ఎదిరించలేక ఒక పేదవాడికి ఉరిశిక్ష విధించాల్సి వచ్చింది. అతని భార్య రోదన నా హృదయంలో లావాలాంటి మంటను రేపింది. పేదలపై సానుభూతితో నా హృదయం నిండింది. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాను.

లోకంలో శాంతి కోసం స్వేచ్ఛగా తిరగాలన్న కోరిక కలిగింది. రోజూ సాయంత్రం బీచ్‌కి వెళ్ళేవాడిని, అనేకరకాల వ్యక్తులను చూశేవాడ్ని. ఒకరోజు నా కనిపించింది. పేద జీవనంలోగల ఆనందాన్ని చూస్తే??? రోజూ పేదవాడి దుస్తుల్లో బీచ్‌కి వెళ్ళటం అలవాటు చేసుకున్నాను. కలిసే వారితో హృదయపూర్వకంగా మాట్లాడేవాడ్ని.

ఓరోజు సాయంత్రం బీచ్‌లోఉన్న పడవ చాటున కూర్చొని సిగిరెట్టు వెలిగించి త్రాగుతున్నాను. అతను గబగబా వచ్చి నా ప్రక్కగా కూర్చున్నాడు. నేనతని వైపు ఏం కావాలన్నట్లు చూశాను.

"క్షమించాలి ఓ సిగిరెట్టుందా?" అని అడిగాడు. మాట్లాడకుండా ఇచ్చాను.

సిగిరెట్టు అంటించి "మిమ్మల్ని రోజూ ఇక్కడే చూస్తూంటాను." అన్నాడతను రింగులుగా పొగను వదులుతూ.

"అయితే రోజూ మీరు నన్ను గమనిస్తున్నారన్న మాట."

"అవు" నన్నట్లు తలూపాడతను, నేనాలోచించి చెప్పాను. "తిండిలేక ఉద్యోగం లేక మలమల మాడే పేదవాడిని."

అతను పిచ్చిగా నవ్వాడు. "నేను జీవితం కోసం వెతికే పిచ్చివాడిని. వెతికి వెతికి అలిసిపోయాను." అన్నాడతను. "అవును నా భార్యే నా జీవితం. ఆమె కోసం ఆత్మహత్య చేసుకొని జీవిస్తున్న వెర్రివాడ్ని." అతను ఇసుకలో వేళ్ళగింతల వండుకొని అన్నాడు.

అతను జీవితంలో పెద్ద దెబ్బ తిన్నవాడిలా కనుపించాడు.

అప్పటి నుండి రోజూ అతను కలిసేవాడు. లోకాన్ని ఓపిగ్గా గంటల తరబడి తిట్టేవాడు. విచిత్రమైన తత్వం అతినిది. అతని బాధను ఉపశమింప జేయాలను కొన్నాను. బాగా ఆలోచించాను. ఒక కథ అల్లాను. కథ ద్వారా అతనికి లోకంపై గల విహ్వాభావం పోగొట్టాలని నిశ్చయించాను.

అందుకే ఓ రోజు అతన్ని తీరికగా కూర్చోపెట్టి వుహోత్సుకంగా కథ ప్రారంభించాను...

* * *

బీచ్ నిర్మానుష్యమైంది.

మేఘాలు మెల్లిగా విచ్చుకొని పల్చబడసాగాయి పల్చని మబ్బుల గుండా చుక్కలు మసకమసగా కనబడుతున్నాయి.

అతను నా కథ మంత్రముగ్ధునిలా వింటూ కూర్చున్నాడు. క్షణం నిశ్శబ్దంగా దొర్లింది

అతనిలో చలన మేర్పడింది. "మిమ్మల్నే! ఆపేశారేం? చెప్పండి!" అన్నాడు నవ్వుపుతూ. నా కథకు అతను అంతగా చలించటం చూసి నాకు కొద్దిగా గర్వం కలిగింది. తిరిగి చెప్పటం ప్రారంభించాను.

* * *

"రైలు మద్రాసు వైపు పరుగెత్తసాగింది. నా హృదయం వసుంధరతో అల్లుకొనిపోయింది. నా జీవితంలో కలిగిన మార్పు తలుచుకొని కృంగిపోయాను.

రైలు చీకటిని చీల్చుకుంటూ వెళ్ళసాగింది. నేను వసుంధరను వూహించుకొంటూ బాధను మర్చిపోసాగాను. రైలు వూయలలాంటి వూపుకు మెల్లిగా కునుకు పట్టసాగింది. బెర్త్ ఎక్కి నిదురపోయాను.

నిద్దుర లేచేసరికి నాచుట్టు నీళ్ళుండటం చూసి ఆశ్చర్యపోయాను. చాలాసేపటికి రైలుప్రమాదంలో చిక్కుకున్నదని తెలుసుకొన్నాను. మెల్లిగా లేచి దొరికిన వ్యక్తినల్లా నీటి బైటకి లాగసాగాను. నేను అలసిపోయేదాక చాతనైనంత మందిని రక్షించాను. అదృష్టం బాగుండి వసుంధరను రక్షించగలిగాను. కాని ఎంత వెతికినా ఆమె భర్త కనబడలేదు. ఎంతో వెతికాం అతని జాడే దొరకలేదు."


అతని వదనంపై నీటి బిందువు లేర్పడ్డాయి.

"అయితే వసుంధర కులాసాగా ఉందా?" అడిగాడు ఆతురతగా.

"ఉంది" అన్నాను కథ పొడుగిస్తూ.

"ఎక్కడ?" అడిగాడతను.

"నాతోనే, నేను చెప్పేది వినండి" అన్నాను.



# అధైర్య పడవద్దు

శాస్త్రీయమైన, విజమైన SEX-ADVICE పొందవచ్చును. మీకు ఉన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

**డా. రత్నం&సన్స్, (Estd 1904)**

మలకపేట బిల్డింగ్స్, New
(అజంపూరా మార్కెట్ వద్ద)
**హైదరాబాద్—36 ఆం. ప్ర.**

# క్లియరెన్స్ అమ్మకం

నవీన, అందమైన డిజైనులలో, రంగులలో కాశ్మీర్ బ్యూటి ఆర్ట్ చీరలు, పెద్ద సైజు స్పెషల్ డిలక్సురకం రు. 10/- రెండు రు. 19/- మూడు రు. 27/ నాలుగు రు. 35/- ఒకే పార్శిల్‌లో రెండు లేక ఎక్కువ చీరలు కొన్నవారి బ్లౌజుపీసు మరియు ఒకజత ఇయిర్ టాప్స్ ఉచితం. స్టాకు పరిమితం. ఆర్డరు వెంటనే పంపండి. అడ్రసు యింగ్లీషులో వ్రాయండి.



L. D. AHUJA & SONS (WAP)
Post Box No. 1346 Delhi-6,

ఉచితము! ఉచితము!!!

# తెల్ల మచ్చలు

మా ప్రఖ్యాతివహించిన 'డాగ్ సాఫా' ప్రత్యేక ఔషధము తెల్లమచ్చలను సులభముగ పోగొట్టుటలో 1925 సం|| నుండి ప్రఖ్యాతి వహించియున్నది. యీ దురోజులు వాడినంతనే మచ్చల తెలుపుదనం, ఆపైనకొన్నిరోజులలో నే పూర్తిగా బాగుచేయు శక్తిగలదు. ఉచితంగా ఒక పాకెట్ మందుఇవ్వబడును. నకలునుచూచి మోసపోకండి.

**Bengal Ayurved Bhawan**
P. O. Katri Sarai (Gaya) India

# తెల్లమచ్చలకు ఉచిత వైద్యము

శక్తివంతమైన మా ఆయుర్వేద ఔషధము "Swetari" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. సాంఘిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా యివ్వబడును. వెంటనే వ్రాయండి.

Sri Krishna Chandra Vaidya
(A P) P. O. Katrisarai (Gaya)


# విధితెచ్చిన మార్పు

"ఇద్దరం ఆమె భర్త కోసం వెతికి వెతికి విసిగి పోయాం. చివ్వరికి ఆశలు వదులుకొని మద్రాసు వచ్చాము. వసుంధర నాతోనే మద్రాసులో ఉండి పోయింది. ఆమె సంసార సుఖాలను అనుభవించ కుండానే భర్త పోవటం శోచనీయమైన విషయం.

ఆమె బాధ చూడలేక అడిగాను.

"వసూ, జరిగిందానికి బాధపడుత్తూ కూర్చుంటే జీవితంలో బాధ తప్పితే ఏమీ మిగలదు. నీకు అభ్యంతరం లేకపోతే నిన్ను నేను వివాహం చేసుకొంటాను, మొదట్లో ఆమె నిరాకరించింది కాని తరువాత తన అభిప్రాయం మార్చుకొన్నది. నన్ను వివాహం చేసుకొన్నది. ఇప్పుడు వసుంధర నా భార్య."

నిర్మానుష్యమైన బీచ్ చీకటిలో కూర్చున్న నేను అంత కథ పొల్లు పోకుండా చెప్పగలిగినందుకు సంతోషించాను.

అతను అయిదు నిమిషాలు నిశబ్దంగా ఉండి పోయాడు.

అంత చీకటిలో అతని మొహంలోని భావాలను చూడలేక పోయాను.

అతను మెల్లిగా మాట్లాడాడు కంఠం బొంగురుగా ధ్వనించింది. "మీరు చాలా కష్టాలు అనుభవించారు. నాకథ వినండి. మీరు రోజూ నా గూర్చి అడిగే ప్రశ్నలకు నా కథ సమాధానమవుతుంది"

తిరిగి ఆకాశంలో మేఘాలు నల్లగా క్రమ్ముకో సాగాయి అతను లేచి నిలబడ్డాడు పెదవుల మధ్యగ సిగరెట్టు ఉంచి, అగ్గిపుల్లగీసి వెలిగించాడు. అగ్గిపుల్ల మంటలో అతని మొహాన్ని పరిశీలించాను. అతని మొహంలో అనేక క్రొత్త మార్పులు కనుపించాయి ఆ మార్పులను పరిశీలించే లోపులో పుల్ల పూర్తిగా కాలి మంట ఆరిపోయింది

అతను నల్లటి సముద్రంవైపు తిరిగి సిగరెట్టు త్రాగుతూ చెప్పుకొని పోతున్నాడు.

"నేను పుట్టి పెరిగింది హైదరాబాదులో. మా నాన్నగారు డాక్టరు. తను ఆర్జించిన ధనంతో ఇల్లు కట్టారు నన్నెంతో గారాబంగా పెంచారు నేను మెట్రిక్ పూర్తి చేసాను విదేశాలకు వెళ్ళా లనుకున్నాను ఒక్కగానొక్కడినని విదేశాలకు వెళ్ళనివ్వ లేదు

నాకు తెలియకుండా పెళ్ళి నిశ్చయించారు నాన్న గారు నాకు నిర్ణయింపబడిన పిల్ల మా మామ కూతురు. వాళ్ళు చలా ఆస్తిపరులు ఫోటో చూసి పిల్లను ఒప్పుకున్నాను"

అతని కంఠస్వరం తీవ్రంగా ఉంది. అతను మాట్లాడే ప్రతిమాట సముద్రపు హోరును ఛేదించి ప్రతి ధ్వనిగా వినిపిస్తున్నాయి. కదలకుండా కూర్చున్న నేను వింటున్నాను

ఉరుము మెరిసింది ఉరుము ఉరిమింది. సముద్రం భయంకరంగా నవ్వుతోంది.

"పెళ్ళి స్థిరపడింది.పెళ్ళి ఇంటికి తరలివెళ్ళాము. పెళ్ళి బ్రహ్మాండంగా జరిగింది.

మొదటి రాత్రి, నాకో క్రొత్త జీవితాన్ని చవి చూపింది. తెల్లని చీర నీలివన్నెపు జాకెట్, త్రాచు లాంటి నల్లని జడ, నవ్వు ముఖంతో గదిలోకి తీసుకెళ్ళాయి.

నాతని నేను రక్తాన్ని పంచుకున్నది నా సజీవన ప్రదాయిని. మొదటిరోజు పూలపాన్పు దగ్గర నిలబడిన నా భార్య కళ్ళలో కన్నీళ్ళు చూసి ఆశ్చర్య పోయాను.

"ఎందుకీ కన్నీళ్ళు" అడిగాను.

"ఆనందభాష్పాలు" అంటూ వంగి పాదాలకు నమస్కరించింది.

ఆమెతో వాళ్ళ గ్రామంలో గడిపిన వారం స్వర్గాన్ని చవి చూపింది నా భార్య.

జీవితాన్ని పూర్తిగా అనుభవించటానికి 'హనీ మూన్' కని బైలుదేరాం. మీరన్న విధి ఆట బాహాటంగా పుట్టి నన్ను వెంటాడుతోంది. మీరెక్కిన రైలే నేనూ ఎక్కాను నా భార్యతో.

రైలు బైలుదేరింది. బహుశా గమ్యానికి" అతని హృదయాంతరం నుండి భారంగా వెలువడుతున్నాయా మాటలు.

ఆ పెట్టెలో ఇద్దరమే ఉన్నాం. రైలు వూపునిస్తోంది. ఆమె కళ్ళలోకి చూస్తూ అడిగాను.

"ఏం బెంగగా ఉందా?"

ఆమె నా హృదయంపై వ్రాలింది. కన్నీళ్ళతో నా షర్టు తడిసింది. ఆమె అలాగే నిద్రపోయింది. నేనూ అంతే కాని మెలుకువ వచ్చేసరికి నా ఒళ్ళు తెలిసి నంత పనైంది రైలు ప్రమాదంలో చిక్కుకొన్నది. నా భార్యేదీ? . లేదు .ఎక్కడికో పోయింది.

జీవితం, లోకం అంటే విరక్తి కలిగింది.

మద్రాసు వచ్చి నా భార్యను మర్చిపోవాలని త్రాగుడు అలవాటు చేసుకున్నాను. కాని మత్తులో ఉన్నంతవరకే సుఖంగా ఉండగలుగుతాను. తరువాత నా భార్య జ్ఞాపకం వస్తూంటుంది.

అందుకే నా హృదయాన్ని చంపుకొన్నాను. కేవలం జీవిస్తున్నానంటే హృదయంలేని శరీరం మాత్రమే"

అతను సిగరెట్టు బలంగా పీల్చి క్రింద పడేసి ఇసుకలోకి త్రొక్కాడు దాని జీవితం అంతమైంది.

అతను తల నావైపు త్రిప్పి అన్నాడు.

"నా భార్య సుఖాన్నే నేనెప్పుడూ కోరుతాను. ఆమె సుఖమే నా సుఖం. నా భార్య పేరు ఇంతవరకూ చెప్పలేదు కదూ? ఆమె పేరు వసుంధర. ప్రస్తుతపు మీ భార్య. ఆమెకు నా ఆశీర్వాదాలు తెల్పండి."

అతను తల త్రిప్పి సముద్రం వైపు గబగబా నడువసాగాడు.

అతని చివరి వాక్యానికి శిలా ప్రతిమలా ఉండి పోయిన నేను అతను చాలా దూరం వెళ్ళేవరకూ తేరుకోలేదు

"ఆగండి, నేను చెప్పింది కేవలం కల్పితం మాత్రమే, ఆగండి" నా అరుపులు సముద్రపు హోరులో కలిసిపోయాయి.

పెద్దగా మెరిసింది మబ్బు.

ఉధృతంగా లేచే అలలు పొంగుతూ వచ్చాయి. సముద్రం చేతులు చాచి అతన్ని కౌగిలించుకొన్నది. అతను పెనుగులాడలేదు

లేచి నిల్చున్న నేను ఆ బీచ్‌లో ఏకాకినైపోయాను. సముద్రపు హోరు నన్ను దూషిస్తున్నట్లుగా ఉంది.

నా కళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు నిలిచాయి.

వెనక్కు తిరిగిన నన్ను వెక్కిరిస్తున్నట్లు కనిపించాయి, దూరంగా రోడ్డుపై వెలిగే దీపాలు.

నల్లని మబ్బులు జాలిగా వర్షపు జల్లుల్ని దాల్చింది.